నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | ఫిబ్రవరి 1, 2024 | www.navatelangana.com

షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన



తలమడుగు : లింగి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం అధికారులు మాట్లాడుతూ పాఠశాల, కాలేజీ అమ్మాయిలను పోకిరిలు ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్ వంటి వాటి ద్వారా మోసపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. సమస్యలు ఎదురైతే వెంటనే షి టీం నెంబర్ 8712659953కు కాల్ చేయాలని, సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. మైనర్లపై అఘాయిత్యాలు జరిగితే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. షీ టీంకు ఫిర్యాదు చేసే వారి పేరు, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో షీటీం బృందం సభ్యులు బి.సుశీల, జి.సత్యమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై 2న సమావేశం

నవతెలంగాణ-నిర్మల్

ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులుగా నియమించబడిన ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి బి.భారతి లక్‌పత్ నాయక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే ఈ సమావేశానికి నిర్మల్, ఆదిలాబాద్, కొమురంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. అధికారులు తమ నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఈసారైనా మోక్షం లభించేనా..?

- ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌కు ఎదురుచూపులు
- ఏండ్లు గడుస్తున్నా నిధులు కేటాయించని వైనం
- సీసీఐ పునరుద్ధరణ..విమానాశ్రయ ఏర్పాటుపైనా ఆశలు
- నేడు తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్రం

ఏటా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్ ఉమ్మడి జిల్లావాసులను నిరాశకు గురిచేస్తోంది. ఏండ్లుగా నాన్చుతున్న ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్‌కు ఇంకా మోక్షం లభించడం లేదు. ఈ రైల్వేలైన్ పూర్తయితే ఆదిలాబాద్- నిర్మల్ వాసులకు రాజధాని నగరానికి ప్రయాణం సులువుగా మారుతుందని ఆశలు పెట్టుకున్నా.. కేంద్రం ఆ దిశగా నిర్ణయం తీసుకోవడం లేదు. తాజాగా ఈ రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సాధన కమిటీ రిలే దీక్షలు చేపట్టింది. ఈ నిరసనను కేంద్రమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లడంతో కనీసం తాజా బడ్జెట్‌లోనైనా ఈ ప్రతిపాధన కార్యరూపం దాల్చుతుందో లేదోనని ఉమ్మడి జిల్లావాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోపక్క గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మూతపడిన సీసీఐ పరిశ్రమను తెరిపిస్తామని బీజేపీ నాయకులు హామీనిచ్చారు. గత ఎన్నికల్లో ప్రజలు వారినే ఆదరించారు. కానీ ఈ పరిశ్రమను మాత్రం తెరిపించడం లేదు. ఇక జిల్లా కేంద్రంలో విమానశ్రయ నిర్మాణం ప్రతిపాధనలకే పరిమితమైంది. తాజాగా కేంద్రప్రభుత్వం గురువారం మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న దృష్ట్యా ఉమ్మడి జిల్లాకు ఏమైనా ప్రయోజనం దక్కుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రం ప్రవేశపెడుతున్న మధ్యంతర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ప్రత్యేకంగా జిల్లాకు సంబంధించి అభివృద్ధి పనులకు ఎలాంటి నిధులు కేటాయించడం లేదు. అందరికీ సంక్షేమ పథకాలు వర్తించినట్లే..ఉమ్మడి జిల్లావాసులకు వస్తున్నాయి తప్పితే..ప్రత్యేకంగా ఉమ్మడి జిల్లాలో కేంద్రం చేపడుతున్న అభివృద్ధి పనులంటూ ఏమీ కనిపించడం లేదు. ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలంటూ ఉమ్మడి జిల్లావాసులు ఏండ్లుగా కోరుతున్నారు. 2017లో ఈ లైన్ మంజూరుచేసినా నిధులు కేటాయించడంలో మాత్రం జాప్యం జరుగుతునే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టాల్సిన ఈ పనులను ఇంకా ప్రారంభం కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వడం లేదని కేంద్రం.. కేంద్రమే పట్టించుకోవడం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఒకరినొకరు విమర్శలు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాయి. తప్పితే ఈ లైన్ మార్గానికి పరిష్కారం మాత్రం లభించడం లేదు. ప్రస్తుతం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే మహారాష్ట్ర మీదుగా సుమారు 520కి.మి దూరం 12గంటల పాటు ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ రైల్వేలైన్ అందుబాటులోకి వస్తే 320కి.మి దూరంలో సుమారు 5గంటల్లో హైదరాబాద్ చేరుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రతి బడ్జెట్‌లోనూ దీని ప్రస్తావన లేకపోవడంతో జిల్లావాసులు నిరాశకు గురవుతున్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో కేంద్రం ఈ రైల్వేమార్గం నిర్మాణంపై దృష్టిసారిస్తుందని జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు. మరోపక్క కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్ వెళ్లే మార్గంలో ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. కేంద్రం నిధులు విడుదల చేయకపోవడం మూలంగా పనులు ముందుకు సాగడం లేదు.

సీసీఐ పునరుద్ధరణపై ఆశలు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో సిమెంట్ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమ కోసం అప్పట్లో 2289 ఎకరాల భూమిని సేకరించారు. 48.66మిలియన్ టన్నుల ముడి సరుకు ఉండగా.. 1979లో పనులు ప్రారంభం కాగా.. 1984లో సిమెంట్ ఉత్పత్తి ప్రారంభమైంది. 1998లో ఈ పరిశ్రమ మూతపడింది. ఇంకా 42.66మిలియన్ టన్నుల ముడి సరుకు అలాగే ఉండిపోయింది. ఈ పరిశ్రమ అర్ధాంతరంగా మూతపడటంతో వేలాది మంది కార్మికులు రోడ్డునపడ్డారు. 2018 ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మళ్లీ సీసీఐ తెరిపిస్తామని ఆ పార్టీ నాయకులు హామీనిచ్చారు. వారు చెప్పినట్లే.. ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆదరించి ఆ పార్టీ అభ్యర్థిని ఎంపీగా గెలిపించారు. కానీ ఈ పరిశ్రమ విడి భాగాలను తుక్కు కింద విక్రయించాలని ఆదేశించింది. కానీ ఈ పరిశ్రమను తెరిపించేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. జిల్లా ప్రజల ఒత్తిడి మేరకు కేంద్రం పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకుంటే వేలాది మందికి ప్రత్యక్షంగా..పరోక్షంగా ఉపాధి లభించేందుకు అవకాశం ఉంటుంది. మరోపక్క ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విమానశ్రయం నిర్మించాలని ప్రభుత్వం భావించింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆరు చోట్ల నిర్మించాలని నిర్ణయించగా.. ఇందులో ఆదిలాబాద్ ఒకటి. ఇప్పటికే ఇక్కడ 369 ఎకరాలు విమానశ్రయానికి సంబంధించి ఖాళీ స్థలం ఉంది. ఇప్పటికే ఎయిర్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఇక్కడకు వచ్చి సర్వే నిర్వహించి విమానశ్రయ ఏర్పాటుకు అనుకూలమని నివేదిక ఇచ్చారు. కానీ కేంద్రం ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు.

కిసాన్ సమ్మాన్‌నిధిపై..

కేంద్రప్రభుత్వం రైతుబంధు తరహాలోనే కిసాన్ సమ్మాన్‌నిధి పేరుతో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తోంది. ఎకరానికి రూ.2వేల చొప్పున మూడు విడతల్లో ఏడాదికి రూ.6వేల సాయం అందిస్తోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సాయం కంటే తక్కువగా ఉన్నప్పటికీ రైతులకు కొంత మేర ఉపశమనం కలిగిస్తోంది. తాజాగా ఈ సాయాన్ని రూ.9వేలకు పెంచనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ బడ్జెట్‌లోనే కేంద్రం ఈ నిర్ణయం ప్రకటిస్తే వేలాది మంది రైతులకు మరికొంత ప్రయోజనం కలిగేందుకు ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రోడ్డు భద్రత నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి



నవతెలంగాణ-హాజీపూర్

రోడ్డు భద్రత నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి లెక్కల కిష్టయ్య అన్నారు. 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ అధికారి లెక్కల కిష్టయ్య, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ కుమార్ ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. డిటిఓ కిష్టయ్య చేతులు జోడించి వాహనదారులకు రోడ్డు భద్రతపై బాధ్యతగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా చర్యలు ప్రతి ఒక్కరూ పాటించాలని, వాహనాలతో ప్రయాణం చేస్తున్నప్పుడు అతివేగం ప్రమాదకరమని, ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలో బుధవారం టీఎస్‌యుటిఎఫ్ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. సంఘం ఉద్యమాలకు ఆకర్షితులై మండలంలోని వివిధ ఉపాధ్యాయులు సంఘ సభ్యత్వాన్ని స్వీకరించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. భవిష్యత్తులో ఇంకా అనేక మందిని సంఘంలో చేర్చుకుంటామన్నారు. ప్రభుత్వం బాకీ ఉన్న మూడు డీఎలను వెంటనే విడుదల చేయాలని, వాయిదా పడిన ప్రమోషన్, బదిలీ షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, బలిరాం, జిల్లా నాయకులు షేక్ ఫాసిల్, మురళీధర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కుమురం భీం విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని అర్లి-టి గ్రామంలో కుమురం భీం విగ్రహాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్‌తో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్ కుమారుడు బీఆర్‌ఎస్ యువ నాయకుడు వైభవ్ అకాల మరణం చాలా బాధాకరమన్నారు. ఆయన గ్రామ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. వైభవ్ మృతి గ్రామానికి, ఆయన కుటుంబానికి తీరని లోటని తెలిపారు. ఆయన జ్ఞాపకార్థం కుమురం భీం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివాసీ గిరిజన పోరాట యోధుడు భీం చేసిన జల్ జంగల్ పోరాట ఫలితంగానే ఈ రోజు ఆదివాసులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హక్కులు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం పిప్పల్‌కోటి ప్రభుత్వ పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాటల పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కళ్యాణి, తాంసి జెడ్పిటిసి రాజు, కన్వీనర్ నాగయ్య, నాయకులు సంజీవరెడ్డి, అఫ్రోజ్, కపిల్, మండల విద్యాధికారి శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో బుధవారం ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతిని ప్రజా సంఘాలు ఘనంగా నిర్వహించాయి. ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు డి.రాములు మాట్లాడుతూ ప్రజా గాయకుడు గద్దర్ రాడికల్ యువజన సంఘంతో ఉద్యమం ప్రారంభించి విరసం వ్యవస్థాపకుల్లో కీలకమైన పాత్ర పోషించారన తెలిపారు. జననాట్యమండలిని ఏర్పాటు చేసి గాయకుడిగా ప్రజలందరినీ చైతన్యవంతం చేసిన మహానాయకుడని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. జిల్లా కేంద్రంలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు త్వరలో గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వి.ప్రభాకర్, గడ్డం శ్రీనివాస్, కుంటోల్ల వెంకటస్వామి, పురుషోత్తం, కొంతం వసంత్, మొయినుద్దీన్, గోవింద్ నాయక్, సూర్యకాంత్ కాంబ్లే, చరణ్, డోంగ్రే సంతోష్, రవి నాగారం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తా

- వేలాల గట్టు మల్లన్న పరిసరాలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా
- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గం పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నట్లు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి బుధవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. టేకుమట్ల గ్రామంలో సింగరేణి నిధులు రూ.62లక్షలతో నిర్మించిన మినీ కమ్యూనిటీ హాల్‌ను సర్పంచ్ గోనె సుమలత నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సహ గ్రామస్తులు కమ్యూనిటీ హాల్ పక్కన ఖాళీ స్థలంలో వంట షెడ్, డైనింగ్ హాల్ నిర్మించి ఇవ్వాలని కోరారు. టేకుమట్ల శివారు సర్వే నెంబర్ 286లో గల 10 ఎకరాల స్థలంలో మిని స్టేడియం, ఓపెన్ జిమ్, వాక్ ట్రాకర్ ఏర్పాటు చేస్తూ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన అక్కడే ఉన్న శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ సంజీవరెడ్డితో మాట్లాడి స్థలాన్ని పరిశీలించి పనులు ప్రారంభించాలని కోరారు. వేలాల గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.23 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మన్, ఉప సర్పంచ్ డేగ నగేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన వారితో పొరుగు రాష్ట్రాల నుండి వేలాల మల్లిఖార్జున స్వామి దర్శనార్థం తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా వేలాల సమీపంలో గల గుట్టపై వెలిసిన గట్టుమల్లన్న భక్తుల అవసరాల మేరకు స్థానిక నాయకుల కోరినట్లుగా అటవీ అధికారులతో మాట్లాడి గుట్టపై మిగులు రోడ్డు 700 మీటర్లు నిర్మించడానికి కృషి చేస్తానని వెల్లడించారు. అనంతరం గంగిపల్లిలో రూ.20లక్షలతో నిర్మించిన పల్లె దవఖానాను సర్పంచ్ లింగారెడ్డితో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మిట్టపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ సర్పంచ్ సౌజన్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం గ్రామంలో నిర్మించిన మహిళా భవన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ప్రకటించిన పథకాలన్నీ అమలు చేస్తామని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహమ్మద్ ఫయాజొద్దీన్, రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, చల్ల సత్యనారాయణరెడ్డి, చల్ల విశ్వంబర్‌రెడ్డి, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బేతు తిరుపతిరెడ్డి, చందుపట్ల పాపిరెడ్డి, జయపాల్‌గౌడ్, పండుగ రాజన్న, రిక్కుల లక్ష్మినారాయణరెడ్డి, జక్కుల వెంకటేశం, ముదాం రమేష్, సుంకరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

16న బంద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న కోరారు. బుధవారం మండలంలోని లక్కారం అంగన్వాడీ కేంద్రంలో డివిజన్ సదస్సు ఏర్పాటు చేశారు. దీనికి ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల అంగన్వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ, మధ్యాహ్నం భోజనం కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్ షీట్ ప్రకటిస్తూ లక్షలాది కుటుంబాల ఇంటింటికి వెళ్లి క్యాంపియన్ చేయాలని తెలిపారు. బీజేపీ ప్రభుత్వంలో నిరుద్యోగం 50 సంవత్సరాల గరిష్ట స్థాయికి పెరిగిపోయిందని, అంబాని, ఆదానీల పెట్టుబడులను పెంచడమే ధ్యేయంగా పని చేస్తోందని విమర్శించారు. ఫిబ్రవరి 4న జరిగే జిల్లా సదస్సుకు కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి రత్నమాల, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నైతం శోభ, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బాలే శ్రీనివాస్, అంగన్వాడీ నాయకులు ముక్త, సుభద్ర, లక్ష్మి, సురేఖ, పార్వతి, ఆశా యూనియన్ నాయకులు అనిత, వి.అనిత, సురేఖ, గంగమ్మ, వనమాల, సంగీత, యశోద, గ్రామపంచాయతీ నాయకులు సోనేరావు, వెంకట్రావ్, సుందర్, నర్సయ్య, రాము పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

ఈ నెల 2న ఇంద్రవెల్లిలో జరిగే సిఎం సభను విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2న ఇంద్రవెల్లిలో జరిగే భారీ బహిరంగ సభకు వస్తున్న నేపథ్యంలో బోథ్ నియోజకవర్గ, జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. రాబోయే కాలంలో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ 17 పార్లమెంట్ స్థానాల్లో ఘన విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, బ్లాక్ అధ్యక్షులు మహమూద్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు కోటేష్, చంటి, ముస్తఫా, మల్లేష్ పాల్గొన్నారు.

చీర కొంగుకు నిప్పంటుకొని వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన మందుల గంగమ్మ(68) ప్రమాదవశాత్తు చీర కొంగుకు నిప్పంటుకొని మృతి చెందంది. ఎస్ఐ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం..శనివారం ఇంట్లో దేవుళ్ల దగ్గర దీపం ముట్టించి వెనుతిరిగే సమయంలో చీర కొంగుకు నిప్పంటుకొని గాయాలయ్యాయి. వెంటనే 108లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది.

ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌కు నిధులు కేటాయించాలి

- కేంద్ర బడ్జెట్‌లో సీసీఐ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలి
- అఖిలపక్ష రాజకీయ పార్టీల డిమాండ్
- సాధన పోరాట కమిటీ ఏర్పాటు
- కన్వీనర్‌గా బండి దత్తాత్రి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ అభివృద్ధికి తలమానికంగా ఉన్న సీసీఐ(సిమెంట్ ఫ్యాక్టరీ)ని పునరుద్ధరించాలని, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్‌కి వచ్చే బడ్జెట్ సమావేశాలలో నిధులు కేటాయించాలని, విమానాశ్రయం, గిరిజన యూనివర్సిటీ, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. బుధవారం సీపీఐ(ఎం) కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం కాంగ్రెస్ నాయకుడు నల్లా గణపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆదిలాబాద్ అభివృద్ధికి తలమానికంగా ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ ఏర్పాటుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వీటిని సాధించడానికి అన్ని పార్టీల ఆధ్వర్యంలో దశల వారీగా ఉద్యమాలను చేపట్టాలని నిర్ణయించారు. భవిష్యత్ ఉద్యమాన్ని మరింత విస్తరించేందుకు, ఈ ఉద్యమంలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు ముందుకు రావాలన్నారు.

ఆదిలాబాద్ అభివృద్ధి సాధన పోరాట కమిటీ ఏర్పాటు

అనంతరం అన్ని పార్టీల ఆధ్వర్యంలో ఆదిలాబాద్ అభివృద్ధి సాధన పోరాట కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ కన్వీనర్‌గా బండి దత్తాత్రి(సీపీఐ(ఎం)), కో కన్వీనర్‌లుగా బాలూరి గోవర్ధన్‌రెడ్డి(కాంగ్రెస్), విజ్జగిరి నారాయణ(బీఆర్‌ఎస్), ప్రభాకర్‌రెడ్డి(సిపిఐ), వెంకట్‌నారాయణ(న్యూడెమోక్రసీ), జగన్(ప్రజాపంథా), కొండ రమేష్, గోవర్ధన్ యాదవ్, లోకారి పోశెట్టి(రైతుసంఘం), మల్యాల మనోజ్(టీఎంఆర్పీఎస్), అగ్గిమల్ల గణేష్(ధర్మ సమాజ్ పార్టీ), గడుగు మహేందర్(బీఎస్పీ)ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా పూసం సచిన్, బండి దేవిదాస్, రోకండ్ల రమేష్, నంది రామయ్య, కుంటాల రాములు, దర్శనాల అశోక్, నక్క రాందాస్, నీరటి ఉదయ్‌కిరణ్, మడావి గణేష్ ఎన్నికయ్యారు.

గుడుంబా రవాణా, విక్రయించిన కఠిన చర్యలు

నవతెలంగాణ-కడెం



నిషేధిత గుడుంబా తయారీ, రవాణా, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన మునిగంటి గంగవ్వ వద్ద సుమారు ఐదు లీటర్లు నిషేధిత గుడుంబా, 100 లీటర్ల పులియబెట్టిన బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్నారు. నేర స్థలం వద్ద ధ్వంసం చేసి నేరస్తులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది ముత్యం, రషీద్, రవళి ఉన్నారు.

ఉత్తమ పంచాయతీ సెక్రటరీకి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఉత్తమ గ్రామపంచాయతీ సెక్రటరీగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న మావల సెక్రటరీ మహేందర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా బుధవారం మావల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. గ్రామాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్, ఎంపీపీ సంగీత, ఎంపీడీఓ సునీత, వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి ఉన్నారు.

నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ రూరల్ మండలంలో లంగ్డాపూర్‌లో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న రోడ్లు, డ్రైనేజ్‌లు, గ్రామపంచాయతీ భవనాలు, స్ట్రీట్ లైట్స్, ఇలా ప్రతీ కార్యక్రమం కేంద్ర నిధులతో నిర్వహిస్తున్నామని తెలిపారు. నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అంజు కుమార్‌రెడ్డి, రావుల రాంనాథ్, తోకల అనిల్, జమాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బదిలీపై వచ్చిన సీఐకి ఆదివాసీ నాయకుల సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రానికి బదిలీపై వచ్చిన నూతన సీఐ రహీమ్ పాషాను బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివాసీ నాయకులు శాలువాతో సన్మానం చేశారు. గ్రామాల్లో శాంతి పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ఏఎంసీ వైస్ ఛైర్మెన్ తొడసం నాగోరావ్, తెలంగ్‌రావ్ పటేల్, తొడసం సొంజీ, కాశిరాం, పాండు, పూసం ఇస్రు, మెస్రం జైవంత్, ఆత్రం రాము ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-ఉట్నూర్

పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని నాగాపూర్, మత్తడి గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అధికారులు, నాయకులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాథోడ్ చారులత, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, నాగాపూర్ సర్పంచ్ జాదవ్ సునీల్, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని సీఆర్టీల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడం శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఇంద్రవెల్లి సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. కాంట్రాక్టు రెసిడెన్సియల్ ఉపాధ్యాయుల టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, ప్రతినెల సకాలంలో వేతనాలు చెల్లించాలని అన్ని ప్రభుత్వ శాఖల, మాదిరిగా సీఆర్టీల సర్వీసును క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. మంత్రిని సానుకూలంగా స్పందించి, సమస్యలను గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ ఐఏఎస్‌కి ఫోన్‌లోనే సమస్యలను వివరించారు. త్వరలోనే సమస్యలు పరిస్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉయిక రమేష్, జిల్లా అధ్యక్షులు డి.వంశీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సుంగు, మాజీ జిల్లా అధ్యక్షులు కె.జలపత్‌రావు, జిల్లా నాయకులు జె.భీమేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.అశోక్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌ను మొదటి స్థానంలో నిలపాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్
- మార్చ్ 9న జాతీయ లోక్ అదాలత్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్ అదాలత్‌తో అత్యధిక కేసులను పరిష్కరించి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ అన్నారు. మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై న్యాయవాదులకు బుధవారం కోర్టు ఆవరణలో సమావేశం నిర్వహించారు. అధికంగా కేసులను పరిష్కరించేలా న్యాయవాదులు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ అక్షర క్రమంలో మొదటి స్థానంలో ఉన్న ఆదిలాబాద్ జాతీయ లోక్ అదాలత్ కేసుల పరిష్కరంలో మాత్రం వెనకబడుతుందన్నారు. రాష్ట్రంలో 25వ స్థానానికే పరిమితం అవుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టుల్లో 8 వేల 588 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వీటిలో రాజీమార్గం ద్వారా అత్యధికంగా కేసులను పరిష్కరించి ఆదిలాబాద్‌ను మొదటి స్థానంలో ఉంచేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా జడ్జీ శివరాంప్రసాద్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, న్యాయమూర్తులు ప్రమీల జైన్, దుర్గారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎగ్రాల నగేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వాహనాన్ని నడపాలి



- రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ
- పాల్గొన్న ఎస్పీ గౌస్ ఆలం
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వాహనాన్ని నడపాలని ఆ వాహనాన్ని నడిపే క్రమంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని నిర్లక్ష్యంగా, అతివేగంతో వాహనాలను నడపకూడదని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించే రోడ్డు భద్రత కార్యక్రమాలలో భాగంగా బుధవారం పట్టణంలోని నలంద కళాశాలలో నిర్వహించిన రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కళాశాల ఎన్‌సీసీ బృందం ద్వారా గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం విద్యార్థులతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పురాతన కాలం నుంచి కొనసాగుతున్న పద్ధతి నివారణ కంటే నిరోధన ఉత్తమమని అవలంబించినప్పుడు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని తెలియజేశారు. ప్రమాదం సంభవించినప్పుడు బాధపడే కన్నా ప్రమాదం జరగకముందు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని సూచించారు. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జరుగు రోడ్డు భద్రత వారోత్సవాలలో ప్రజలకు, విద్యార్థినీ విద్యార్థులకు, ఆటో డ్రైవర్లకు లారీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వాహనదారులు చైతన్య పరిచే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ప్రమాదాల బారిన ఎక్కువ మొత్తంలో పడే యువత వాహనాన్ని నడిపే క్రమంలో తమ కుటుంబ సభ్యులను మదిలో ఉంచుకుంటూ వాహనాన్ని నడపాలని అన్నారు. ప్రమాదం సంభవించడం, వేగం ఈ రెండు అంశాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయని, వేగాన్ని పెంచినప్పుడు ప్రమాదాల సంఖ్య పెరుగుతుందని వేగాన్ని తగ్గించినప్పుడు ప్రమాదాల సంఖ్య తగ్గుతుందనే అంశాన్ని విద్యార్థులకు వివరించారు.

హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలి

అతివేగంగా వాహనాన్ని నడిపితే ఆనందం వస్తుందనే ఆలోచనతో కాకుండా ప్రమాదం ఏ విధంగానైనా సంభవిస్తుందనే ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. హెల్మెట్ ధరించి వాహనాన్ని నడిపినప్పుడు ప్రమాదం జరిగినా గాయాలు కాకుండా బ్రతికే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి రోడ్డు ప్రమాదాలను బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. స్థానిక నలంద కళాశాల నుంచి కేసీబీ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, రూరల్ సీఐ సైదారావు, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ప్రణయ్ కుమార్, మావల ఎస్సై విష్ణువర్ధన్, కళాశాల డైరెక్టర్ విజయబాబు, ప్రధానోపాధ్యాయులు విజయ్ గోపాల్, కళాశాల సిబ్బంది ప్రశాంత్, అశోక్, కిరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంచి పనులే గుర్తింపు నిస్తాయి : జనార్ధన్

నవతెలంగాణ-నార్నూర్



చేసిన మంచి పనులే చిరస్థాయిగా గుర్తింపునిస్తాయని జెడ్పీ ఛైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రలో నిర్వహించిన సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, ఉపసర్పంచ్ చౌహాన్ మహేందర్, వార్డు సభ్యుల పదవీ విరమణ సభకు ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ముందుగా సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శాలువాతో సన్మానించి, అభినందించారు. సర్పంచ్ గజానంద్ నాయక్ మండల కేంద్రంలో చేసిన సేవలను అభివృద్ధి పనులను చూసి కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు యూనూస్ అక్బాని, బంజారా సేవా సంఘం నాయకులు రెడ్డి నాయక్, బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణ నాయక్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి ఛైర్మెన్ ఆడే సురేష్, మార్కెట్ వైస్ కమిటీ వైస్ ఛైర్మెన్ తొడసం నాగోరావ్, ఎంపీటీసీ పరమేశ్వర్, ఎంపీటీసీ అబేదా ఖానం, ప్యాక్ డైరెక్టర్ దుర్గే కాంతారావు, మాజీ ఉపసర్పంచ్ దాదే అలీ, మండల కోఆప్షన్ సభ్యులు దస్తగిర్, మాజీ జెడ్పీటీసీలు హేమలత, రూపావతి జ్ఞానోబా పుష్కర్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, నాయకులు సుభాష్, హైమద్, రేణుకా బాయి, మహేందర్ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16న సమ్మె

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-ఖానాపూర్

బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ, ఫిబ్రవరి 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. బుధవారం ఖానాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫిబ్రవరి 16 సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాకా కార్మికుల రక్షణ కొరకు ఉన్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్స్‌ను తీసుకువచ్చిందని అన్నారు. కాగా దీన్ని వెంటనే రద్దు చేయాలనీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం గ్రాట్యూటి చెల్లింపు, సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించలేదని అన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి, పర్మినెంట్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల అధ్యక్షులు, కే.శేఖర్, గ్రామపంచాయతీ యూనియన్ మండల కార్యదర్శి నాగరాజు, మండల ఉపాధ్యక్షులు పోశెట్టి, మండల కోశాధికారి స్వామి, సహాయ కార్యదర్శి రవి, నాయకులు లక్ష్మణ్, అంగన్‌వాడీ యూనియన్ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్, మామడ మండలం అధ్యక్షురాలు వనజ పాల్గొన్నారు.

నిర్మల్ : ఫిబ్రవరి 16న జరుగబోయే దేశ వ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు డి.పోశెట్టి అన్నారు. బుధవారం సోన్ మండల సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను, విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల వాటాలు అమ్మడం, ప్రయివేటీకరణ చేయడం ఆపాలన్నారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఉపాధిహామీ చట్టాన్ని విస్తరించాలని పని రోజులు 200లకు పెంచాలన్నారు. రోజుకు రూ.600 లు కనీస వేతనం ఇవ్వాలన్నారు. జాతీయ పట్టణ ఉపాధి హామీ చట్టం చేయాలన్నారు. గ్యారంటీతో కూడిన సేకరణతో పాటు, అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఇచ్చి చట్టబద్ధత కల్పించాలన్నారు. నిత్యావసర వస్తువులపై జీఎస్‌టీని ఉపసంహరించాలన్నారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, వంట గ్యాస్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని గణనీయంగా తగ్గించాలనీ డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి, బలోపేతం చేయాలన్నారు. 45వ ఐఎల్‌సీ ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులను కార్మికులుగా గుర్తించాలనీ, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలినీ, ప్రతినెలా రూ.10వేలు పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాంగ్రెస్ మేనిఫెస్టోలో అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు పద్మ అనురాధ, గీత, స్వర్ణ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఖానాపూర్



నిర్మల్

రైల్వేలైన్‌ను ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

రైల్వేలైన్‌ను ఏర్పాటు చేయాలని, యూనివర్సిటీ, రైల్వే, తాగు, సాగునీరు సాధన కమిటీ ఆదిలాబాద్ జిల్లా కోకన్వీనర్ బానోత్ రామారావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ నుంచి కేస్లాపూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, కెరమెరి, జోడేఘాట్, ఆసిఫాబాద్ మీదుగా కాగజ్‌నగర్ వరకు రైల్వేలైన్‌ను ఏర్పాటు చేయాలనీ కోరారు. రైల్వేలైన్ ఏర్పాటు అయితే మన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ కట్ల లక్ష్మణాచారి, మెస్రం కేశవ్ ఉన్నారు.

పంట క్షేత్రాలను పరిశీలించిన ఏఓ



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని మలేగాం గ్రామంలో బుధవారం వ్యవసాయ పంటక్షేత్రాలను ఏఓ వికార్ హైమద్ పరిశీలించారు. రబీ సీజన్‌లో మండలంలో అధిక మొత్తంలో అన్ని గ్రామాల రైతులు మొక్కజొన్న పంటలను సాగుచేయడం జరుగుతుందని అన్నారు. మలేగాంలో మొక్కజొన్న పంటలను ఏఓ పరిశీలించారు. మొక్కజొన్న పంటకు ఎండుతెగులు వ్యాధులు రావడంతో మొక్కజొన్న పంట ఎండిపోవడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ అధికారి నివారణ చర్యలకు రైతులకు పలు సూచనలు, సలహాలు అందించి, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎండు తెగులు నివారణకు వాడాల్సిన మందులు కాపార్ ఆక్సిక్లోరైడ్, ప్లాంతమైసిన్‌లు మొక్క అడుగుబాగంలో పిచికారీ చేయాల్సి ఉంటుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మహిపాల్‌రెడ్డి, ఏఈఓ చందన, రైతులు ఉన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్

ఇంద్రవెల్లిలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ మండల పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లిలో జరగబోయే సీఎం సభను ఖానాపూర్ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

3న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడ్డి బోజారెడ్డి, రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8, 10, 12, 14 సంవత్సరాల విభాగం బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించే, ఈ పోటీలకు అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయసు ధృవీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 10 నుంచి కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 9492136510 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న జెడ్పీహెచ్ఎస్ భరంపూర్ పాఠశాల ఆవరణలో సబ్-జూనియర్ జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు పాయల శంకర్, జబాడే రాష్ట్రపాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్టు ఫిబ్రవరి 16 నుంచి 19 తేదీ వరకు సూర్యాపేట జిల్లా చింతలపాలెం (మల్లారెడ్డి గూడెం)లోని 33వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు 20-03-2008 తరువాత జన్మించినవారు అర్హులన్నారు. అబ్బాయిలు, అమ్మాయిలు 55 కేజీలు బరువు ఉండి ఆధార్ కార్డు, పాఠశాల బోనాఫైడ్ సర్టిఫికెట్, రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజుతో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. పూర్తి వివరాల కొరకు 7702035200 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | ఫిబ్రవరి 01, 2024 | www.navatelangana.com

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తా

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి సీతక్క వెల్లడించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమెకు అసిఫాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గతంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రస్తుతం కూడా జిల్లాలో జర్నలిస్టులకు ఇవ్వడానికి తన వంతు కృషి చేస్తానని దీని కోసం కలెక్టర్‌తో వ్యక్తిగతంగా మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిప్ప సురేష్, ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, నాయకులు సంతోష్, వేణుగోపాల్, శ్రీధర్, నితేష్ పాల్గొన్నారు

జంతు సంరక్షణ పక్షోత్సవం



కాగజ్‌నగర్ రూరల్ : పశువైద్యశాఖ, పశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియా జడ్పీహెచ్ఎస్‌లో జంతు సంరక్షణ పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల పట్ల అనుసరించాల్సిన విధానాలను వివరించారు. జంతు సంరక్షణ, వాటి రక్షణ, పోషణ గురించి వాటి పట్ల వ్యవహరించాల్సిన దయాపూరిత విధానాలను అవగాహన కల్పించారు. పిచ్చికుక్కలను గుర్తించడం, రెబిస్ వ్యాధి లక్షణాలు, విధి కుక్కలకు రేబిస్ టీకా వేయించడం, వ్యాధి సోకిన పశువులు, మనుషులు తీసుకోవాల్సిన చికిత్స గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటరాజయ్య, పశువైద్యాధికారులు విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఆర్థిక తోడ్పాటు అందించే దిశగా చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పిల్లల ఉద్యానవనంకు వచ్చే సందర్శకులకు తినుబండారాలు, స్నాక్స్, అల్పాహారము విక్రయించేందుకు చిరు వ్యాపారులకు ఆర్థిక తోడ్పాటు అందించే దిశగా అవకాశం కల్పించడం జరుగుతుందని కలెక్టర్ బొర్కడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4వ నుంచి ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జిల్లా కేంద్రంలోని పిల్లల ఉద్యానవనంలో చిరు వ్యాపారులు సందర్శకులకు వివిధ రకాల ఆహార పదార్థాలు విక్రయించి ఆర్థికంగా ఎదిగేందుకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వినియోగదారుల సంఖ్య పెరిగి, నాణ్యమైన ఆహారం అందించినట్లయితే ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని అన్నారు. స్వయం సహాయక సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, స్థానిక శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులతో సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటామని, ఇతర వివరాలకు 9490873390 నంబర్ సంప్రదించవచ్చని తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తెలంగాణా రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ 2024 డైరీని బుధవారం ఆర్డీఓ కాసబోయిన సురేష్ ఆవిష్కరించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీఓ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు నారాయణ, ఎస్ఆర్ మూర్తి, కలికోట రమణయ్య యెల్లాగౌడ్, దేవయ్య, బంగారి బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్పంచులకు ఘన సన్మానం

నవతెలంగాణ-జైనూర్

గత ఐదు సంవత్సరాల నుంచి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలో సర్పంచ్‌గా గెలిచి మంచి సేవలు అందించిన మండల సర్పంచులకు ఎంపీపీ కుమ్రా తిరుమల విశ్వనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని 26 మంది సర్పంచులకు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వారు వెంట జైనూరు మండల అభివృద్ధి అధికారి ప్రభుదయ, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్, మండలంలోని సర్పంచులు, మెస్రం పార్వతి లక్ష్మణ్, మాడవి భీమ్రావు, మేస్రం రాహుల్, కుమ్రం కేశవరావు, గుణాజీ, కినక రామ్ షా, మెస్రం నాగోరావ్, వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శి ఉదయ్ రాంప్రసాద్, మధుకర్, రమేష్ పాల్గొన్నారు

ఉచిత కంటి ఆపరేషన్‌కు తరలింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధర్వంలో నిర్వహించిన వైద్యశిబిరంలో అవసరం ఉన్న వారిని బుధవారం ఆపరేషన్ల నిమిత్తం తరలించారు. కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అనిత దంపతుల ఆధ్వర్యంలో 16 మందికి ఆపరేషన్ నిమిత్తం భోజనం సదుపాయం, ప్రయాణ చార్జీలు సమకూర్చి వారిని బుధవారం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది గోపి పాల్గొన్నారు..

ఈవీఎంలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలి

• ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని, దీనికోసం కలెక్టరేట్‌లో అధికారులకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఈవిఎం ఓటరు అవగాహన కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు వేసే విధానాన్ని ప్రజలకు వివరించడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు వేసే విధానాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. అనంతరం ఓటరు అవగాహన కేంద్రంలో ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది జితేందర్, మధు, రియాజ్ పాల్గొన్నారు.

నేడు సర్పంచులకు సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం జనవరి 31తో ముగిసిన సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎంపీపీ జుమిడి సౌందర్య ఆనంద్, ఎంపీడీఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్, మండల ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని బోదంపెల్లి గ్రామంలో మూల మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ఎస్సై మధుకర్ బుధవారం ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో పలువురు ప్రయాణికులు, గ్రామస్తులు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కూలీలకు గుల్లల పంపిణీ

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని ఖైరి గ్రామంలో ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు సర్పంచ్ లెన్గురే విజయలక్ష్మి ఆధ్వర్యంలో గుల్లలు పంపిణీ చేశారు. ఉపాధి పనుల్లో పంపిణీ చేసిన గుల్లలను సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగోషే సోమనాథ్, ప్రఫుల్, సోనేరావు, బాలాజీ, తులసీరామ్ పాల్గొన్నారు.

ఆరు నూరైనా గ్యారెంటీలు అమలు చేస్తాం

• రాష్ట్ర మంత్రి సీతక్క

నవతెలంగాణ ఆసిఫాబాద్



గత ప్రభుత్వం లాగా మాట తప్పే ప్రభుత్వం కాదని ఆరు నూరైనా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) పునరుద్ఘాటించారు. ఫిబ్రవరి 2వ తేదీన ఇంద్రవెల్లిలో నిర్వహించే సీఎం సభకు సంబంధించి జిల్లా కేంద్రాల్లో కార్యకర్తలతో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరుగ్యారంటీలలో ఇప్పటికే రెండు అమలు చేశామని రానున్న కొద్ది రోజుల్లో మిగతా నాలుగింటిని తప్పక అమలు చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అట్టడుగు స్థాయికి నెట్టిందని ఆరోపించారు. జిల్లాకు ప్రాణదారమైన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పక్కనపెట్టిందన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన కొమరం భీమ్, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టులు కూడా పూర్తి చేయలేక పోయిందని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన తర్వాత మిగులు బడ్జెట్‌తో అప్పగించిన రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా అభివృద్ధి కోసం కృషి చేస్తానని, ఇప్పటికే జిల్లా కేంద్రంలో అత్యవసరమైన గైనకాలజిస్టును పంపించామన్నారు. దీనికి నిదర్శనం 2006లో తీసుకువచ్చిన 100 రోజుల పని ఇప్పటికీ పేదలకు తిండి పెడుతుందని, అభివృద్ధి పనులన్నీ కూడా ఆ పథకం కింద నడుస్తున్నాయని అన్నారు. ఇతర జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రిగా చేసే అవకాశం తనకు వచ్చినప్పటికీ ఆదిలాబాద్ ఎంచుకున్నానని ఇష్టంతో కష్టపడి జిల్లా అభివృద్ధికి అందరం కన్నృషి చేద్దామన్నారు. అధికారంలోకి రాకముందు జిల్లాకు వచ్చిన మొట్టమొదటిసారి తన కాళ్లుకడిగిన ఆడబిడ్డ వలె ఆదరించారని అది తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా అయిన తర్వాత తన ప్రస్థానాన్ని దళిత గిరిజన దండోరా పేరుతో ఇంద్రవెల్లి నుంచి ప్రారంభించి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులను కూడా అదే స్ఫూర్తితో పోరాటాల గడ్డ నుంచి ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఇంద్రవెల్లి స్మృతి వనానికి రూ.కోటి రూపాయలు కేటాయించనున్నట్లు గతంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పెండింగ్ రహదారులు పూర్తి చేయడానికి ఇంద్రవెల్లి సభలో అవసరమైన నీధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఇంద్రవెల్లి సంఘటనలో చనిపోయిన వారికి ఇండ్ల స్థలాలు అందించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2 సభను విజయవంతం చేసి జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరు పునరంకితం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, రాష్ట్ర నాయకుడు గాదర్ల అశోక్, జిల్లా నాయకులు రావి శ్రీనివాస్, గణేష్ రాథోడ్, రేఖా నాయక్, గుండా శ్యామ్, శ్రావణ్, మంగ, రాజేశ్వరి, ఆత్రం కుసుమరావు పాల్గొన్నారు.

రోగుల పట్ల స్నేహభావంతో వ్యవహరించాలి

• అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-సిర్పూర్

ప్రయివేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందిచాలని రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది స్నేహభావంతో వ్యవహరించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లాలోని సిర్పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉండాలని, విధుల పట్ల సమయపాలన పాటించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం సిర్పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు సందర్శించి ఉపాధ్యాయులు, అధికారులతో 10వ తరగతి వార్షిక పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులు కార్యచరణ ప్రకారంగా విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని, విద్యార్థులు అందరూ 10 జీపీఏ సాధించేలా కృషి చేయాలని కోరారు. విద్యార్థుల ప్రగతి ఆధారంగా తక్కువ ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పరీక్షలకు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. వార్షిక ఫలితాలలో జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందుంచే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

3 చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొరే కళ్యాణ్, జగజంపుల తిరుపతి అన్నారు. పట్టణంలోని జన్కాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 3న జరిగే ప్రొటెస్ట్ మార్చ్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం-2020 ద్వారా విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడమేనన్నారు. విద్యా విధానం అంటే అన్ని వర్గాల విద్యార్థులకు విద్యతో పాటు విద్యా, ఉపాధి అవకాశాలు ఇవ్వాలని, శాస్త్రీయ సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించాలని, కులమత రహిత అంతరాలను తొలగించాలన్నారు. విద్యార్థులకు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక అంతరాలు పోయే నవసమాజాన్ని సృష్టించాలి కానీ వీటికి భిన్నంగా ఈ విధానం తీసుకొచ్చారని ఆరోపించారు. కనీసం ప్రతిపక్షాలు, విద్యార్థులు, ప్రొఫెసర్లు, మేధావులు, విద్యావంతులు ఎవరితోనూ కనీసం చర్చ కూడా లేకుండా ఈ విధానం తీసుకవచ్చారని, విద్యను పూర్తిగా కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌తో చేపట్టే ఢిల్లీ ప్రొటెస్ట్ మార్చ్‌ను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కళాశాల కమిటీ సభ్యులు దుర్గం శిరీష, హర్షిత, రాజేశ్వరి, అంజలి, సోఫియాభాను, అంజన్న, ఆత్రం పోచయ్య, చాపిదే క్రాంతికుమార్, అశ్విన్ కుమార్, జశ్వంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-కౌటాల

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు బుధవారం శంకుస్థాపన చేశారు. తుమ్మిడిహెట్టి గ్రామ పంచాయతీ పరిధిలోని పీపీనగర్‌లో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్(ఐటీడీఏ) ద్వారా మంజూరైన రూ.2.50కోట్లతో చేపట్టే బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా ఏజెన్సీ గ్రామాలలో అభివృద్ధి పనులను చేపట్టనున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఒక్కొక్కటిగా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తుమ్మిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం కోసం సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చరణ్‌దాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బండి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షులు వాను పటేల్, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య కుంచాల సత్తయ్య, కుంచాల విజయ్, ఆడె చందు, ఎల్ములే మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి మృత్యుంజయ్, కవిరాజ్, చందన్, తిరుపతి, తిరుపతిగౌడ్, మేకల తిరుపతి, లెండుగురే బాబురావు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అనిత అన్నారు. కళాశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల నుంచి 5 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థినిల క్రీడాఅభివృద్ధికి అవసరం అయిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెదక్ జిల్లా తుప్రాన్‌లో ఫిబ్రవరి-2, 3, 4 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి కళాశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కవిత, పీఈటీ చిన్నక్క, పీడీ లక్ష్మి, జిల్లా సెక్రెటరీ గుర్విందర్ పాల్గొన్నారు.

కనీస వేతన విధానం అమలు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం సిబ్బందికి కనీస వేతన విధానం అమలు చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంకు వచ్చిన మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన గురుకులంలో ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్న తమకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇతర గురుకులాల్లో సిబ్బందికి కనీస వేతనం అమలు అవుతుందని తమకు కూడా న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సంతోష్, మహేందర్, ప్రేమల, విలాస్, లలిత పాల్గొన్నారు.

సర్పంచుల సేవలు గుర్తుండి పోతాయి

• ఎంపీపీ మోతీరాం, జడ్పీటీసీ ద్రుపతబాయి

నవతెలంగాణ-కెరమెరి

సర్పంచుల సేవలు గుర్తుండి పోతాయని, గ్రామాల అభివృద్ధిలో వారి కృషి అమోఘమని ఎంపీపీ పెందూరు మోతిరామ్, జడ్పిటిసి చెడ్మకి ద్రుపతబాయి అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులకు ఎంపీడీవో మహేందర్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పిటిసి సర్పంచుల సేవలను కొనియాడారు. ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. వారి పనితీరు చాలా బేషుగ్గా ఉందని కొనియాడారు. మండలంలోని అనేక మంది సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధి కోసం సొంత డబ్బులు ఖర్చు చేసినట్లు తెలిపారు. మరి కొందరు అప్పులు చేసి పనులు చేశారన్నారు. ఎంతో మంది కష్టపడి గ్రామాలను ఉన్నతంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఐదేళ్ల పాటు గ్రామాల అభివృద్ధికి కష్టపడి పనిచేసిన సర్పంచులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు ఎంపీడీఓ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సయ్యద్ అబుల్ కలాం, ఏవో గోపికాంత్, సర్పంచులు రాథోడ్ బయనబాయి, రాథోడ్ శేషారావ్, తొడసం జగన్నాథ్‌రావు, కుంరం నానేశ్వర్, మధుకర్, విజయలక్ష్మి బాలాజీ, రజిత, లక్ష్మీ పాల్గొన్నారు.

కంది కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

• అదనపు కలెక్టర్ దాసరి వేణు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతులు కంది కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రాల్లోని మార్కెట్ యార్డ్‌లో జడ్పిటిసిల అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌తో కలిసి కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కందులకు ఈ సంవత్సరం మద్దతు ధర ఎక్కువగా ఉన్నందున రైతులు కందులను దళారులకు అమ్మి మోసపోకూడదని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే కందులను అమ్ముకోవాలని సూచించారు. రైతులు కందులను విక్రయించే సమయంలో పట్టా పాసుబుక్కు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. దీంతో నేరుగా రైతుల ఖాతాలోనే డబ్బులు జమ అవుతాయని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీఓ ప్రసాద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయ్, సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్, నాయకులు గోపాల్ నాయక్, బాపురావు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గుండి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐదు సంవత్సరాలుగా గ్రామ అభివృద్ధికి విశిష్ట సేవలను అందించి పదవి విరమణ పొందుతున్న సర్పంచ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించి సేవలను కొనియాడారు. సర్పంచ్ జబరి అరుణ రవీందర్ మాట్లాడుతూ గడిచిన 5ఏండ్ల కాలంలో ప్రజలు ఇచ్చిన అవకాశంతో గ్రామంలో మొత్తంగా రూ.2కోట్ల 45లక్షల నిధులను తీసుకొచ్చి ప్రతి వాడల్లో సిసి రోడ్లు, డ్రైనేజిలు, 9వ తరగతి వరకు పాఠశాల ఉన్నతీకరణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. చేసిన అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. సర్పంచ్‌గా అవకాశం ఇచ్చిన గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండి ఎంపీటీసీ గాదవేణి మల్లేష్, ఏఎంసి డైరెక్టర్లు శ్యామ్‌రావు, మిట్ట పోశన్న, ప్యాక్స్ డైరెక్టర్ నార ఆశన్న, ఇదులవాడ మాజీ ఎంపిటిసి రమేష్, వార్డు సభ్యులు ప్రవీణ్, మల్లేష్, రోజా-రాజు, అంజుబాయి, శైలజ, లక్ష్మీ కో అప్షన్ సభ్యులు గణపతి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామపంచాయతీ పరిధిలోని అమీన్‌గూడ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన కల్పించారు. కళాజాతా బృందం సభ్యులు ఆటాపాటల ద్వారా ప్రజలకు బ్యాంకు సేవల గురించి అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ బీమా యోజన పథకాల గురించి తెలియజేశారు. డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏటీఎం పిన్ నెంబర్ ఎవరికీ చెప్పకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోలేటి శాఖ బ్యాంకు మేనేజర్ విశ్వప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్, క్యాషియర్ సురేష్, బ్రాంచ్ స్టాఫ్ ఇమ్రాన్, దుర్గం జనార్ధన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణ పాల్గొన్నారు.

ఓబీసీ సాధన సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఓబీసీ సాధన సభను విజయవంతం చేయాలని ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు టొబ్రె శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో, ఉద్యోగాలలో అవకాశాలు రాకుండా పోతున్నాయని, ఓబీసీ సాధన కోసం హైదరాబాద్‌లోని నాచారం రాఘవేంద్రనగర్‌లోని ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తున్న కాలేజీపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ బోర్డ్ నిబంధనలు అతిక్రమిస్తున్న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి నైతం శంకర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఓ కళాశాల ఒకే భవనంలో జూనియర్, డిగ్రీ కళాశాలలు నడుపుతున్నారన్నారు. నిబంధనలకు ఇది పూర్తిగా వ్యతిరేకమని తెలిపారు. అయినప్పటికీ వాటన్నింటిని తుంగలో తొక్కి ఇష్టారాజ్యాంగా కళాశాల నడుపుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సదరు కాలేజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | ఫిబ్రవరి 01, 2023 | www.navatelangana.com

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

నవతెలంగాణ-మందమర్రి



రక్షనతో కూడిన ఉత్పత్తిని సాధించాలని బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ ఏజీఎం కె హెచ్ఎస్ గుప్తా కోరారు. మందమర్రి జీఎం కార్యాలయంలో బుధవారం ఏరియా డిపార్ట్మెంట్ల వారీగా ఏరియా జీఎం మనోహర్, బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ ఏజీఎం కెహెచ్ఎస్ గుప్తా సేఫ్టీ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ గనులకు సంబంధించి తీసుకోవలసిన రక్షణ చర్యలపై చర్చించారు. రక్షనతో కూడిన ఉత్పత్తి ని సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, సేఫ్టీ ఆఫీసర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గనిలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన కార్మికులను గని ఎస్ఈఎం ఇ.స్వామిరాజు బుధవారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామిరాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్యోగులు కంపెనీకి చేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణాతరం ఆరోగ్యవంతమైన జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టె రమేష్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, సంక్షేమాధికారి పాల్ సృజన్, ఫిట్ ఇంజినీర్ రాజగోపాల చారి, ఇంజినీర్ కృష్ణ, సర్వే అధికారి పిచ్చేశ్వర్‌రావు, వెంటిలేషన్ అధికారి చంద్రమౌళి, అండర్ మేనేజర్లు మిట్లపల్లి శ్రీనివాస్, సాత్విక్, పరమేశ్వర్, ఏఐటీయూసీ నాయకులు గజ్జి రమేష్ పాల్గొన్నారు.

లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు



నవతెలంగాణ-తాండూర్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బోయపల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం మధుమేహ వ్యాధి నిర్ధారణ, బ్లడ్ ప్రెషర్ పరీక్షలు నిర్వహించారు. 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. 32కి అవసరం మేరకు ఆదివారం రోజున బెల్లంపల్లి లైన్స్ క్లబ్ ఐ హాస్పిటల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు రౌతు వెంకటేశం కార్యదర్శి ఠాకూర్ ఇమ్రాప్ సింగ్, కోశాధికారి మద్దికుంట రామ్ చందర్, జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ కట్కూరి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు సీహెచ్ సంగీతరావు ఎస్.మహేందర్‌రావు, లయన్ దేవరకొండ రాజయ్య, సాంబమూర్తి క్లబ్ సభ్యులు, బోయపల్లి ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి శ్రీరాములు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటా

నవతెలంగాణ-దండేపల్లి

కార్యకర్తలు ఎవరు కూడా అధైర్యపడవద్దని తమకు అండగా నేను ఉంటా అని మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని గూడెం, నంబాల, వెలగనూరు, కాసిపేట్, కొండాపూర్, ద్వారక, దండేపల్లి గ్రామాలలో ఆయన పర్యటించారు. ఆయన ఆయా గ్రామాల్లోని కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఓడిన గెలిచిన ఎప్పటికీ ప్రజల మనిషినేనని ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని ఆయన అన్నారు. కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడవద్దని ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాబోయే పెద్దపెల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని మళ్లీ తెలంగాణలో గులాబీ జెండా ఎగరవేయాలని ఆ దిశగా కార్యకర్తలు పని చేయాలని ఆయన కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వీపర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-తాండూర్

కేజీబీవీ తాండూర్‌లో ఖాళీగా ఉన్న స్వీపరు(1), స్కావెంజరు (1) మొత్తం 2 పోస్టుల భర్తీకి స్థానిక మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంఈఓ వాసాల ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పై పోస్టులకు 18 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండి, ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని కోరారు. నివాస ధ్రువీకరణ పత్రము, ఏడవ తరగతి సర్టిఫికేట్‌తో ఫిబ్రవరి 5వ తేది సాయంత్రం నాలుగు గంటలలోపు దరఖాస్తులను మండల విద్యావనరుల కేంద్రంలో సమర్పించాలని సూచించారు.

తెలంగాణ యాదవ్ జర్నలిస్ట్ యూనియన్ ఆత్మీయ సమావేశం

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ యాదవ జర్నలిస్టుల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆత్మీయ సమావేశం మండలంలోని పీఆర్‌టీయూ భవనంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హడహక్ కమిటీ సభ్యులు దోటి నాగరాజు, శెట్టి హరికృష్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అర్హత కమిటీ సభ్యులు వారిని శాలువతో సన్మానించారు. ఈ సమావేశంలో యాదవ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారంపై పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఘంలోని జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. త్వరలోనే ఆదిలాబాద్, నిర్మల్ మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. యాదవ జర్నలిస్ట్ మిత్రులు త్వరలో ఏర్పాటు చేయబోయే కమిటీ ఎన్నిక కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడహక్ కమిటీ సభ్యులు ఎన్.దేవేందర్, మేకల రవికాంత్, సీఎచ్.పరశురాం, యాదవ జర్నలిస్టులు రమేష్, కుమారస్వామి, మల్లేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

జాతీయ ఉపాధి హామీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం

జాతీయ ఉపాధి హామీ పనులను బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సర్పంచ్ జాడి గంగాధర్ ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తిమ్మాపూర్ గ్రామంలో వరి పొలాల్లో, చేనుల్లో ట్రాక్టర్ కేజీ వీల్స్ పోవడానికి వీలుగా నూతన రోడ్డును ఉపాధి హామీ పనుల ద్వారా చేయడం జరుగుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు రాజన్న, చంద్రయ్య, లక్ష్మి, వెంకట్, ఫీల్డ్ అసిస్టెంట్ భూమయ్య పాల్గొన్నారు.

కోదండరామ్‌కు కేసీఆర్, కేటీఆర్‌లు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-హాజీపూర్



కోదండరామ్‌కు కేసీర్, కేటీఆర్‌లు బేషరతుగా క్షమాపన చెప్పాలని టీజేఎస్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ బీ.బాబన్న డిమాండ్ చేశారు. తెలంగాణ జన సమితి పార్టీ ఆద్వర్యంలో బుధవారం కేసిఆర్ దిష్టిబొమ్మ ను జిల్లా కేంద్రంలోని ఐబి సెంటర్‌లో దగ్ధం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకలజనసేనాని తెలంగాణ దిక్సూచి ప్రొఫేసర్ కోదండరాం ప్రమాణ స్వీకారం జరగకుండా కోర్టుకు వెళ్ళి తాత్కాలిక నియంత అనందం పొందుతున్న కేసీఆర్ నియంతృత్వ వైఖరిని తెలంగాణ ప్రజలు ఛీ కొడుతున్నారని అన్నారు. కేటీఆర్ కూడా కోదండరామ్ గురించి మాట్లాడుతుంటే ఇంతకన్న దౌర్భాగ్యం ఇంకేముందని అన్నారు. గత పదేళ్ళలో కేసీఆర్ ప్రభుత్వ అవినీతిని ఎక్కడ భయటపెడతడో అని భయంతో కేసిఆర్ కోదండరామ్ ప్రమాణస్వీకారాన్ని అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. కోదండరామ్ ఉద్యమ నేపధ్యం సామాజిక ఉద్యమ చరిత్ర గురించి మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్ కేటిఆర్‌లకు లేదని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలల్లో కాంగ్రెస్‌తో కలిసి తెలంగాణ జన సమితి బీఆర్ఎస్‌కు గుణపాఠం చెబుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షులు రాంచందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోనెల శ్రీనివాస్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర సోషల్ మీడియా ఛైర్మన్ పాముల వెంకట్ సాయి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, సంతోష్, అచ్యుత్ రావు, పి.ధర్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు

నవతెలంగాణ-నస్పూర్



ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో కొనసాగుతున్న ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆర్డీఓ, మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18, 19సం.లు వయస్సు ఉన్న ప్రతి ఒక్కరు తమ వివరాలు ఓటరు జాబితాలో నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, నూతన ఓటరు నమోదు చేసేందుకు వయస్సు నిర్ధారణకు జనవరి 1, 2024ను ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాపై ఫిబ్రవరి 2న అభ్యంతరాలను, ఫిర్యాదులను పరిష్కరించి, 6వ తేదీన పారామీటర్లు పరిశీలించి తుది జాబితా ప్రచురణకు ఎన్నికల సంఘం అనుమతి పొంది ప్రచురణకు పూర్తి వివరాలతో జాబితా రూపొందించడం జరుతుందని, 8వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందనని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫొటో సిమిలారిటీ, 2 చోట్ల ఓటరు కార్డు కలిగి ఉండటం, మృతి చెందిన వారి వివరాలు ఓటరు జాబితా నుంచి తొలగించడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. నూతన ఓటరు నమోదు, జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపులకు 6, 7, 8 ఫారముల ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ సందర్భంగా అధికారులకు దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ నమోదుపై పలు సూచనలు, సలహాలు చేశారు.

బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



నవతెలంగాణ-జన్నారం

ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఫిబ్రవరి 16న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెతో ఎండగట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా ప్రజా, రైతాంగ, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నరు. కార్మికుల రక్షణకు ఉన్న చట్టలను రద్దు చేసే కార్పొరేట్లకు ఊడిగం చేసేటువంటి చట్టాలు తెచ్చిందన్నరు. దేశంలో ఉన్న రైతంగాన్ని, కార్మిక వర్గాన్ని ప్రమాదంలో ముంచడం కొరకే బీజేపీ పాలన కొనసాగుతుందన్నరు. బీజేపీ మతోన్మాద విధానాలను తిప్పి కొట్టాలని ప్రజలకు సూచించారు. దేశంలో ఉన్నటువంటి కార్మికులకు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో మండలంలో ఉన్నటువంటి రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీ కన్వీనర్‌గా అంబటి రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కే.బుచ్చన్న సీఐటీయూ నాయకులు నారాయణ, సత్తన్న, లచ్చన్న, భూమయ్య, నీరజ, సువర్ణ, లక్ష్మి, పాల్గొన్నారు.

అనుమతుల్లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్



అనుమతులు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు ఈదునూరి అభినవ్ డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో గత సంవత్సరం నుంచి శ్రీరామ స్కూల్ పేరు మీద శ్రీ చైతన్య పాఠశాల నిర్వహిస్తూ బెల్లంపల్లి ప్రాంత విద్యార్థులను, విద్యార్థి తల్లిదండ్రులని మోసం చేస్తున్నారన్నారు. విద్యార్థులని తీసుకురావడానికి పంపే బస్సులపైన, విద్యార్థుల బెల్టుల పైన, పుస్తకాల పైన, నిర్వహించే పరీక్ష పత్రాల పైన, కరపత్రాలపైన శ్రీ చైతన్య స్కూల్ అని ఉంటుందని, బెల్లంపల్లిలో శ్రీ చైతన్య పాఠశాలకు ఎలాంటి పర్మిషన్ లేదన్నారు. గతంలో ఉన్న శ్రీరామ పాఠశాల పర్మిషన్ పైనే ఈ స్కూల్ నిర్వహించడం జరుగుతుందని, ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని మండల ఎంఈఓ, డీఈఓకు గత సంవత్సరం నుంచి అనేక సార్లు విన్నవించుకున్న వారిపైన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతధికారులు స్పందించి శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-నస్పూర్

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబందలు పాటించాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు-భవనాల శాఖ అధికారులు, ఎంవీఐలతో రోడ్డు ప్రమాదాల నివారణలో తీసుకోవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు, పాదచారులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమ, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ప్రజలు రోడ్డు ప్రమాదాల నివారించేందుకు జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అనేక ప్రమాదాల నుంచి రక్షిస్తుందని తెలిపారు. కారు నడిపే వారు, కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడుపరాదని, మద్యం సేవించి వాహనం నడుపరాదని తెలిపారు. ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేసే ఆటోలు, జీపులు ఇతర ప్రయివేట్ వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, వాహనదారులు రహదారులలో విధించిన వేగ పరిమితిని మించి అతి వేగంగా ప్రయాణం చేయరాదని, తప్పనిసరిగా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలతో అనేక కుటుంబాలు రోడ్డున పడి ఆర్థికంగా చితికిపోతున్నాయని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణాలతో పాటు కుటుంబాన్ని కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థ అభివృద్ధికి, ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాలిక బద్ధంగా ముందుకు సాగాలని సంబంధిత అధికారులకు శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి సూచించారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కార్పొరేట్ వారి ఆదేశానుసారం గనులలో బాధ్యతలకు వివరించే మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశం నిర్వహించారు. ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి తీసుకోవలసిన చర్యల గురించి అన్ని గనుల, డిపార్ట్మెంట్ల అధికారుల నుంచి సంస్థ అభివృద్ధికి చేయవలసిన వివిధ రకాల కార్యక్రమాల గురించి, అభిప్రాయాలను సేకరించనున్నామని తెలిపారు. అంకితభావం, సమిష్టి కృషితో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకతలు పెంచుకుంటూ సంస్థను ముందుకు తీసుకుపోవాలని అన్నారు. అలాగే సంస్థ పురోగతిని అన్ని విభాగాల, గనుల అధికారులను సమావేశపరిచి వారికి క్లుప్తంగా వివరించారు. మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలకు కన్వీనర్‌గా ఏరియా ఎస్ఓ టు జీఎం, మెంబర్స్‌గా ఏరియా ఇంజనీర్, ఏజీఎం(ఫైనాన్స్), డీజీఎం(ప), డీజీఎం (ఐఈడీ) ఉంటారని తెలిపారు. ఈ మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు అన్ని గనులపై ఫిబ్రవరి 5 నుంచి ఫిబ్రవరి 11 వరకు నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రఘు కుమార్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం(ప) పి అరవింద్‌రావు, డీజీఎం (ఐఈడీ) చిరంజీవులు, శ్రీరాంపూర్, ఇందారం ప్రాజెక్ట్ ఆఫీసర్లు పురుషోత్తమరెడ్డి, శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా ఏజెంట్లు ఏవీ రెడ్డి, గోపాల్ సింగ్, రాముడు, డీజీఎం సీహెచ్పీ డివీ రావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, డీవై సీఎంఓ డాక్టర్ పి. రమేష్ బాబు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- డీడబ్ల్యూఓ కె.చిన్నయ్య

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, 0-5 పిల్లలకు సకాలంలో పోషకాహారం, అనుబంధ ఆహారం అందించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయడం జరుగుతుందని డీడబ్ల్యూఓ కె.చిన్నయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్, లక్షెట్టిపేట ప్రాజెక్టులను యునిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి శివాల్కర్‌రెడ్డి, రాష్ట్ర ఐటి. కమిటీ ప్రతినిధి హరిణి నిలేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమశాఖ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంక్షేమ పథకాలను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు సకాలంలో పోషకాహారం అందించడంతో పాటు వారి బరువు, ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించడం వారి ఆరోగ్యం మరింత మెరుగు పరిచే దిశగా అధికారులు, సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, లక్షెట్టిపేట సీడీపీఓ ఎ.విజయలక్ష్మి, ఎం.రేష్మ, పోషణ్ అభియాన్ డీసీ.రజిత, సమన్వయకర్తలు సతీష్, లక్ష్మి పాల్గొన్నారు.

సర్పంచ్, ఈఓపై విచారణ

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆమోదం లేకుండా పనులు చేపట్టి అక్రమాలకు పాల్పడిన పంచాయతీ ఈఓ, సర్పంచ్‌పై బుధవారం డీఎల్‌పీఓ ఫనిందర్‌రావు విచారణ చేపట్టారు. ఈవో నిబంధనకు విరుద్ధంగా సభ్యుల ఆమోదం లేకుండా కమ్యూనిటీ భవనాలకు ఇంజనీరింగ్ శాఖకు చెందిన భవనాలకు నిధులు ఖర్చు చేశాడని సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయానికి వచ్చిన డీఎల్‌పీఓ రికార్డులను పరిశీలించారు. పంచాయతీలో జరిగిన అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఎల్‌పీఓ తెలిపారు. పూర్తిస్థాయి విచారణకు మండల స్థాయి అధికారులకు ఆదేశించామని తెలిపారు. పంచాయతీ నిధుల దుర్వినియోగానికి అవినీతి అక్రమాలకు పాల్పడితే ఈవో పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఈవో తాపస్ వార్డు సభ్యులు పాల్గొన్నారు

రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-నస్పూర్

రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ఆర్కే-5 గ్రూపు ఏజెంట్ ఏవీరెడ్డి, క్వాలిటీ మేనేజర్ కె.వెంకటేశ్వరరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ కే అమర్‌నాథ్‌రెడ్డి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, అండర్ మేనేజర్లు చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మున్సిపాలిటీ రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. రెడ్డి కులస్తుల సంక్షేమానికి ఐక్యంగా పోరాడాలని, సంక్షేమ సంఘం అభివృద్ధిలో ప్రతి ఒక్కరు సహాయ సహకారం అందించేలా చూడాలన్నారు. ఆపదలో ఉన్న రెడ్డి కులస్తులను ఆదుకోవాలని వారు పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు అందరూ కలిసికట్టుగా ఉండి పరిష్కరించుకోవాలని సూచించారు. అతిథులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు అనుమాండ్ల వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దూదిపాల విజయపాల్ రెడ్డి, నస్పూర్ ప్రధాన కార్యదర్శి మోతె రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు పింగిలి రాంరెడ్డి, కొమ్మిడి మల్లారెడ్డి, కార్యదర్శులు పుప్పిరెడ్డి, బాపిరెడ్డి, మోరపల్లి రామచంద్రా రెడ్డి, మోరపల్లి అశోక్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పాకాల మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కామన్పల్లి గ్రామ గల్ఫ్ కార్మికుడు సాట్ల సత్యంకు గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నాయకులు ఆర్థిక సాయం అందించారు. ఆ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు ఎస్.సత్యం అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఆ సమితి నాయకులు బుధవారం అతన్ని కలిసి రూ.11,500 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రమేష్, సభ్యులు జె.వెంకటేష్, కె.రాజేష్ ఉన్నారు.

నేడు రగ్బీ సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి హై స్కూల్‌లో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 2010 నుంచి 2012 మధ్యలో జన్మించిన వారు అయి ఉండాలని, తమ వెంట ఆధార్, బోనఫైడ్ సర్టిఫికెట్ తెచ్చుకోవాలని సూచించారు. సందేహాలు ఉంటే ఆర్గనైజింగ్ సెక్రటరీ భీమిని రాజేష్ 9676086119 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పొన్కల్ పీఏసీఎస్ ఛైర్మెన్‌గా అల్లం రవి ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొనకల్ ప్రాథమిక రైతు సహకార సంఘం చైర్మన్‌గా రెండ్లగూడ గ్రామానికి చెందిన అల్లం రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత చైర్మన్ శీలం రమేశ్‌పై మంగళవారం సహకార సంఘం డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో బుదవారం డీసీఓ నర్సయ్య పర్యవెక్షనలో నూతన ఛైర్మెన్ ఎన్నిక నిర్వహించారు. మొత్తం 13 మంది డైరెక్టర్లలో 9మంది డైరెక్టర్లు రెండ్ల గూడ డైరెక్టర్ అల్లం రవికి మద్దతుగా చేతులు లేపడంతో అల్లం రవి చైర్మన్‌గా ఎన్నికైనట్లు డీసీఓ నర్సయ్య ప్రకటించారు.

నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి

నవతెలంగాణ-తాండూర్

మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌పై చేసిన అనుచిత వాక్యాలను ఖండించారు. సభా వేదికలపై స్థాయి మరిచి మర్యాద మరిచి మాట్లాడితే ప్రజలు సహించరన్నారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కాంగ్రెస్ నాయకులపై చేసిన పార్టీలను ఖండించారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థాయి మరిచి మాట్లాడడం వల్ల మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ బెల్లంపల్లి నియోజకవర్గంలో తిరిగే మర్యాదను కోల్పోయాడు అని తెలిపారు. దిగజారి మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు సరైన సమాధానం చెప్తారని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మురళీధర్ రావు, పీఏసీఎస్ వైస్ ప్రెసిడెంట్ రత్నాకర్ రావు, తాండూర్ ఎంపీటీసీ సిరంగి శంకర్, సింగల్ విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి పాల్గొన్నారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | ఫిబ్రవరి 01, 2024 | www.navatelangana.com

కల్యాణలక్ష్మీ చెక్కుల అందజేత

నవతెలంగాణ-నిర్మల్

సోన్ మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అందజేశారు. బుధవారం సోన్ మండల కేంద్రంలోని రైతు వేదిక క్లస్టర్‌లో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ



బర్ల మానస హరీష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని, వివిధ శాఖలపై సమీక్షించారు. ఇందులో భాగంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, మత్స్యశాఖ, విద్యుత్, ఆర్టీసీతో పాటు పలు శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ మానస హరీష్‌రెడ్డి, మండల రెవెన్యూ అధికారులు, వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కుష్టు నివారణకు కృషి చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

కుష్టు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ సలాం ఆనంద్‌రావ్ అన్నారు. బుధవారం ఖంపూర్ గ్రామంలో వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా పాఠశాలలో కుష్టు నివారణకు ప్రతిజ్ఞ చేసి, వైద్య సిబ్బంది విద్యార్థులకు స్క్రీన్ పరీక్షలు నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ హిమబిందు, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, కార్యదర్శి కాశీరాం, వైద్య సిబ్బంది విద్యరాణి, పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్, ఆశా కార్యకర్తలు రంభ బాయి, లక్ష్మి బాయి, ఛాయా బాయి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి బాయి ఉన్నారు.



గల్లీ నుంచి ఢిల్లీ దాకా అన్ని స్థానాలను దక్కించుకోవాలి

- కాంగ్రెస్ సమావేశంలో మంత్రి సీతక్క
- సీఎం తొలిసభను విజయవంతం చేయాలని పిలుపు
- పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గల్లీ నుంచి ఢిల్లీ దాకా అన్ని స్థానాలను కాంగ్రెస్ దక్కించుకోవాలని, ఆ దిశగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాకేంద్రంలోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఇంద్రవెల్లి సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు ముగిశాయని అన్నారు. ఇక గల్లీతో పాటు ఢిల్లీ ఎన్నికలు రానున్నాయని తెలిపారు. వాటి గెలుపుకోసం అందరం కష్టపడుదామని అన్నారు. ఆనాడు రేవంత్‌రెడ్డి టీపీసీసీ చీఫ్ హోదాలో ఇంద్రవెల్లి పోరాట స్ఫూర్తితో మొదలుపెట్టిన సభలు రాష్ట్రం మొత్తం సక్సెస్ అయి ఇవాళ అధికారంలో ఉన్నామన్నారు. అదే తరహాలో ఇప్పుడు రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సైతం ఈ ప్రాంతం నుండే సమరశంఖం పూరించనున్నట్టు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యానికి, సంకల్పానికి ఆయనకు అండగా ఉండాల్సిన అవసరం, బాధ్యత మనపై ఉందన్నారు.

ఆదిలాబాద్ జిల్లా అంటే నాకెంతో అభిమానం

ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేక అభిమానమని, జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తనకు బాధ్యతలివ్వటం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తక్కువ వ్యవధిలోనే ఆదిలాబాద్ జిల్లాతో ఎంతో అనుబంధమేర్పడిందన్నారు. సీఎం రాక సందర్భంగా గ్రామాలు, మండలాల వారీగా ఇచ్చిన బాధ్యతలను నాయకులు సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎల్లవేళలా ప్రజల మధ్యనే ఉండాలని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. అప్పుడే మనపై అభిమానం ఏర్పడుతుందన్నారు. రాజకీయమంటేనే సేవ అని, కేవలం నాయకుల వెంట తిరిగి మురిసిపోకుండా ప్రతి కార్యకర్త జనంలో ఉండి నాయకులుగా ఎదగాలన్నారు. అప్పగించిన బాధ్యతలను మాటలతో కాదు చేతల్లో చూపించాలన్నారు. జోకేటోళ్లకు కాదు పనిమంతులకే పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. పార్లమెంటు పరిధిలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు ఓటమి చెందినప్పటికీ అదేమీ పట్టించుకోకుండా వారు కనబరుస్తున్న ఉత్సాహం చాలా గొప్పగా ఉందని చెప్పారు. తమ అగ్రనేత రాహుల్ భారత్ న్యాయ యాత్రను అడ్డుకునేందుకు దుండగులు ప్రయత్నిస్తున్నారన్నారు. రాహుల్ కాన్వాయ్‌పై దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. అంతకుముందు సమావేశానికి హాజరైన సీనియర్ నాయకులు, సమావేశ ఇన్‌చార్జ్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఇంద్రవెల్లి నుండే రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమరాన్ని నాడు ఆరంభించారన్నారు. లక్ష మందితో నిర్వహించిన ఆ సభను అంతే స్థాయిలో ఏమాత్రమూ తగ్గకుండా ఈమారు కూడా ఇంద్రవెల్లి సభను నిర్వహిద్దామని తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

ఫిబ్రవరి 2న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన ఇంద్రవెల్లి సభ సన్నాహక సమావేశంలో భాగంగా పలువురు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సీతక్క సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారందరికీ సీతక్క కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని, రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తమ పనితనం ఉండాలని, పార్టీ శ్రేణులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం మాతా రమాబాయి మహిళా మండలి సభ్యులతో కలిసి రమాబాయి అంబేద్కర్ 126వ జయంతి వేడుకల పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ దిగంబర్‌రావ్ పాటిల్, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, ఎస్టీ సెల్ జిల్లా చైర్మెన్ షెడ్మకి ఆనంద్‌రావు, పట్టణ అధ్యక్షుడు నగేష్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు సంతోష్‌రావు, మైనార్టీ నాయకులు షకిల్ పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



నవతెలంగాణ-కడెం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలో జెడ్పీహెచ్ఎస్ చదువుతున్న విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బుధవారం మండలంలోని వివిధ జెడ్పీ పాఠశాలలోని 8, 9, 10 తరగతి విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్ష తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు వేర్వేరుగా నిర్వహించగా, తెలుగు మీడియంలో మండల కేంద్రానికి చెందిన జెడ్పీ పాఠశాలలోని విద్యార్థులు దేవేందర్, స్పందన, చందన ప్రథమ బహుమతి పొందగా జెడ్పీ పాఠశాల లింగాపూర్ గ్రామానికి చెందిన జగదీశ్వర్దన్ ద్వితీయ బహుమతి పొందారు. అలాగే ఇంగ్లీష్ మీడియంలో మండల కేంద్రానికి చెందిన జడ్పీ పాఠశాలల్లోని విద్యార్థులు బి.శృతి, అభినయ్, రామ్ చరణ్ ప్రథమ బహుమతి పొందగా, మండలంలోని లింగాపూర్ జెడ్పి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రవళిక, తేజస్విని, హర్ష మహేంద్ర ద్వితీయ బహుమతి పొందారని తెలిపారు. మండల స్థాయి ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు త్వరలో జరిగే జిల్లాస్థాయి పోటీలో పాల్గొంటారని, జెడ్పీ పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, రమేష్ బాబు, మురళి, వెంకటరమణ, వినోద్ కుమార్, శివకుమార్, విశ్వనాథ్‌రెడ్డి, దశరథ్, లక్ష్మీ పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాల కోసం ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ మైనార్టీ గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యాలు కల్పిస్తున్నమని ఆర్ఎల్సీఓ రహిల్ అహ్మద్ అన్నారు. మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాల కోసం బుధవారం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన విధుల గుండా బ్యాండ్ మేళాతో విద్యార్థులు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎల్సీఓ రహిల్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల మైనార్టీ కళాశాలలు, పాఠశాలల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 24 జనవరి నుంచి 6 ఫిబ్రవరి అడ్మిషన్లు జరుగుతాయన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి మైనార్టీ గురుకులాల్లో వారి పిల్లలను చేర్పించాలన్నారు. సంబంధిత గురుకులాల్లో కానీ, ఆన్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాళ్లు తిరుపతి, ఆసిఫ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యులకు ఘన సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో గ్రామ సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్లను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మండలంలోని సుంకిడి గ్రామంలో సర్పంచ్ గెల్ల మహేందర్‌తో పాటు వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఐదేండ్లు వారు గ్రామానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, మాజీ సర్పంచ్ ఆశన్న, గ్రామస్తులు వెంకన్న, విలాస్, అశోక్, లింగన్న, అజయ్, కిష్టన్న, పోచ్చన్న, ప్రకాష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జస్టిస్ పుంజాల శివశంకర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలో బుధవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో మాజీ కేంద్ర న్యాయశాఖ మంత్రి, గవర్నర్ జస్టిస్ పుంజాల శివశంకర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేందర్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. మాజీ కేంద్ర మంత్రి, గవర్నర్ జస్టిస్ పుంజాల శివశంకర్ భారత దేశంలో మొట్టమొదటి విగ్రహానికి నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గం ముథోల్ గ్రామంలో భూమిపూజ చేయడం జరిగిందని అన్నారు. పుంజాల శివశంకర్ చేసిన నిస్వార్థమైన కృషి వల్లనే ఈరోజు బీసీ ఉద్యోగాల పరంగా విద్య పరంగా అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇటిక్యాల వెంకటకిషన్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు గంగాధర్, కార్యదర్శి బారే శ్రీనివాస్, రిసెర్చ్ స్కాలర్ లక్ష్మీ నారాయణ, సీనియర్ తాలూకా అధ్యకులు రోళ్ల రమేష్, ముథోల్ సర్పంచ్ రాజేందర్, ఉపసర్పంచ్ సంజీవ్, బీడీసీ అధ్యక్షులు గుంజాల నారాయణ, సాయినాథ్ మేత్రి, డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, రమేష్ మేకల, కిషన్ పతంగె, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేత

నవతెలంగాణ-కుభీర్

సీసీఐ పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తునట్టు మార్కెట్ కమిటీ కార్యదర్శి గంగన్న, సీసీఐ అధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఆయా గ్రామాల్లో ఉన్న రైతులు తాము పండించిన పత్తి కొనుగోళ్ల గురువారం నుంచి ఆదివారం వరకు మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని పేర్కొన్నారు. మండలంలో ఉన్న రైతులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు. తిరిగి సోమవారం పత్తికొనుగోళ్లు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

మున్సిపల్ ఉత్తమ కార్మికులకు సన్మానం



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మున్సిపాలిటీకి చెందిన ఉత్తమ కార్మికులుగా ఎన్నికైన శ్రీనివాస్, ఉప్పరి శివమ్మ, బిర్జుల పోసాని, బొబ్బిలి రాజమణి, కత్తి సుశీల, ధీ కొండా నర్సు, శేఖర్‌లకు ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు జి.కిషన్ కుమార్ మాట్లాడారు. కార్మికులకు ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్ పే కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల నుండే ప్రతినెలా వేతనాలు చెల్లించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్నట్లుగానే తెలంగాణలో సైతం రూ.24వేల 500ల వేతనం చెల్లించాలని అన్నారు. పారిశుధ్య సేవల్లో ప్రయివేటీకరణ చర్యలను ఉపసంహరించాలన్నారు. రాంకీ తదితర ప్రయివేట్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. కొత్తగా నియమించుకున్న కార్మికులను, పాత కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.25లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలనీ, దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వాలన్నారు. 11వ పీఆర్సి కమిషన్ సిఫారసు చేసిన వేతనాలను జీఓ నెం. 60 ప్రకారం రూ.19వేలు రూ.22వేల 900లు, రూ.31వేల 40లను కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలన్నారు. ఆదివారాలు, పండుగ సెలవులు, గంటల పని దినాన్ని అమలు చేయాలన్నారు. దీన్ని వాటర్ వర్క్స్ కార్మికులకు సైతం వర్తింపజేయాలన్నారు. పారిశుధ్య కార్మికుల పిల్లలకు ప్రత్యేక స్కాలర్‌షిప్ ఇవ్వాలనీ, ఉన్నత చదువులకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ మొదటి ప్రాధాన్యతనిచ్చి డబుల్ బెడ్ రూం, స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పోశెట్టి, సుజాత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజమణి, కోశాధికారి శైలజ, బిల్డింగ్ యూనియన్ జిల్లా నాయకులు అతిక్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పార్డి(బి) గ్రామ శివారు ప్రాంతంలో చిరుతపులి సంచారం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) గ్రామ శివారు ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్టు బుదవారం పార్డి(బి) గ్రామానికి చెందిన గుమ్మల సంతోష్ అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో మొక్కజొన్నకు నీళ్లు ఇవ్వడానికి వెళ్లగా ఒక్కసారి రైతు సంతోష్‌కు చిరుతపులి కనిపించడంతో భయంతో ఉరుకులు పరుగులు తీసి కొద్ది దూరం వెళ్లి గ్రామస్తులకు, చుట్టుప్రక్కల ఉన్న రైతులకు తేలడంతో రైతులు వెంటనే అటవీశాఖ అధికారులు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని చిరుతపులి సంచరించిన ప్రదేశాలు పరిశీలించగా, చిరుతపులి పాదముద్రలు సేకరించారు. గ్రామస్తులు చుట్టు ప్రక్కల రైతులు భయాందోళన చెందుతున్నారు. రెండు మూడు రోజులు చిరుతపులి సంచరిస్తున్న ప్రదేశాలకు రైతులు వెళ్లకుండా చూడాలని అటవీ శాఖ అధికారులు రైతులకు సూచించారు.

కమ్యూనిటీ షెడ్‌ను ప్రారంభించిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో సకినాపూర్ గ్రామంలో రూ.5లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ షెడ్‌ను బుధవారం జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా గ్రామ సర్పంచ్ మారుతి పదవీకాలం ముగియడంతో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్ రెడ్డి మాట్లాడుతూ తన వంతుగా తన నిధులతో పాటు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే నిధుల నుంచి కూడా నిధులు తీసుకువచ్చి గిరిజనుల అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలిస్తున్నందున మండలానికి మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారుతి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రతాప్, ఆ పార్టీ నాయకులు నారాయణ, సంతోష్, పోశెట్టి, శంభు, నగేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరందించాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మిషన్ భగీరథ నీటిని తాగు నీటిని ప్రతి ఇంటికి అందించాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అడ్వాల పద్మరమేష్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ముందుగా ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి సందర్భంగా గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్షించారు. ఇరిగేషన్, ఆరోగ్య, పంచాయతీరాజ్, మత్స్యశాఖ, విద్యుత్, ఆర్టీసీ, ఉపాధి హామీ, అటవీ, రెవిన్యూ, వ్యవసాయ, మత్స్య, విద్యా శాఖలతో పాటు పలు శాఖల అధికారులతో సమీక్షించారు. పాఠశాలల్లో విద్యార్థులకు టాయిలెట్స్ ఏర్పాటుపై ఎంఈఓ మధుసుధన్‌ను అడిగి తెలుసుకున్నారు. మిషన్ బాగీరథ పథకంలో వేల కోట్ల ప్రజాధనంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీటి పంపిణీ పూర్తి స్థాయిలో జరుగడం లేదని అన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని మిషన్ బాగీరథ అధికారులను హెచ్చరించారు. మత్స్య శాఖ అధికారులు వాణిజ్య చేపలు, రొయ్యల పెంపకంపై దృష్టి సారించాలని, చేపల ఉత్పత్తి తగ్గించి, వాణిజ్య చేపలు, సాంప్రదాయ చేపల పెంపకం చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ అడ్వాల పద్మ, ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ నసీరుద్దీన్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ పాలకవర్గానికి సన్మానం



నవతెలంగాణ-ముథోల్

ముథోల్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఐదేండ్లు పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచ్ రాజేందర్, ఉపసర్పంచ్ పాలకవర్గానికి బుధవారం గ్రామపంచాయతీలో ఘనంగా సన్మానించారు. తమకు ఐదు సంవత్సరాలు అధికారులు. నాయకులు, గ్రామస్తుల సహాయ సహకారాలు అందించడంతోనే అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి పోతన్న యాదవ్, జూనియర్ అసిస్టెంట్ అనూష, సభ్యులు సందూర్ గంగాధర్, బాబన్న, బలోల్ల శంకర్, అయిటి యోగేష్, సంగోళ్ల నవనీత పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పరీక్షలు



నవతెలంగాణ-నిర్మల్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నిర్మల్ లో మండల స్థాయి చెకుముకి పరీక్షలు బుధవారం నిర్వహించారు. పరీక్ష పేపర్లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుచిత్ర పేపర్లను విడుదల చేసి పరీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో తార్కిక ఆలోచనలు, హేతుబద్ధ ఆలోచనలు, పోటీ పరీక్షలపై అవగాహన కలిగించడమే కాకుండా ప్రజలలో మూఢనమ్మకాలను తొలగించి, సమాజ చైతన్యానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ పరీక్షలో ప్రథమ స్థాయిలో వచ్చిన వారు జిల్లాస్థాయి పరీక్షలకు అర్హత సాధిస్తారని, జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గజపల్లి నర్సయ్య తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కొండా రాములు, పర్యావరణ కన్వీనర్ సల్లా పోశెట్టి, కార్యదర్శి రఫీక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

నవతెలంగాణ-నేరడిగొండ

నేరడిగొండ మండలంలోని రాజుర గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిన్ననాన్న కొడుకు జాదవ్ అంబరావు ఇటీవల మరణించారు. విషయం తెలుసుకొని బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబాన్ని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. ఆయనతో పాటుగా బోథ్ నియోజవర్గ వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయి


జన్నారం


కుభీర్

నవతెలంగాణ-జన్నారం

ప్రజలకు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జక్కు భూమేష్ అన్నారు. బుధవారం మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను స్థానికులు, అంధికారులు శాలువా పూలమాలతో సత్కరించారు. అలాగే తపాలాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ నైనాల తిరుపతి, ఉప సర్పంచ్ రాజన్నతోపాటు వార్డు సభ్యులకు గ్రామస్తులు శాలువా పూలమాలతో సత్కరించారు. అలాగే రేండ్లగూడ గ్రామంలో సర్పంచ్ నెమలికొండ ఆశరాజ్ వార్డు సభ్యులకు గ్రామస్తులు శాలువా పూలమాలతో సత్కరించారు. సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ నేటితో తమ పదవీకాలం ముగియడంతో, గ్రామాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని సమస్యలను పరిష్కరించామన్నారు. ప్రజలు తమ పాలనను గుర్తుంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పొన్కల్ ఈఓ రాహుల్ ఆయా గ్రామాల కార్యదర్శిలు పంచాయతీ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

దండేపల్లి :మండలంలోని రాజు గూడ గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో బుధవారం సర్పంచ్ మర్సకోల లచ్చుపటేల్‌తోపాటు పాలకవర్గ సభ్యులను మాజీ ఎంపీపీ ఆకుల రాజేందర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో రాజు గూడ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని అన్నారు. అనంతరం వారిని గ్రామస్తులు స్థానిక నాయకులు పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, తాళ్లపేట ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి నాయకులు రాజేందర్, బాబాజీ, అనసూర్య, పద్మ, రాజవ్వ, రజిత, భీమయ్య, భగవంత్ రావు పాల్గొన్నారు.

జైపూర్ : గ్రామ పంచాయతీ సర్పంచులుగా ఎన్నికై ఐదేండ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచులను స్థానికులు ఘనంగా సన్మానించారు. బుధవారంతో పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న సర్పంచులను శాలువాలతో సన్మానించడంతో పాటు పుష్పగుచ్చాలు అందించి గౌరవించారు. జైపూర్ మండలం షెట్‌పల్లి గ్రామ పంచాయతి సర్పంచ్ మేడి రవిని స్థానిక హెచ్ఈఓ గంగన్న, ఎఎన్ఎం స్వరూప, గ్రామ పంచాయతి కార్యదర్శి పత్రిభరాణి, ఆశావర్కర్లు, మల్టీ వర్కర్లు సన్మానించారు. కానుకూరు గ్రమ పంచాయతి సర్పంచ్ వెంకటేశ్ గౌడ్‌ను గ్రామస్థులు, వార్డు సభ్యులు ప్రత్యేక వేధిక మీదుగా ఘనంగా సన్మానించారు. అదేవిదంగా భీమారం మండలం నర్సింగాపూర్(బీ) గ్రామ పంచాయతి సర్పంచ్ దుర్గం మల్లేష్‌తో పాటు వార్డు సభ్యులను స్థానికులు ఘనంగా సన్మానించారు.

కుభీర్ : కుభీర్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను బుధవారం మండల వైస్ ఎంపీపీ మోహియోద్దీన్ సన్మానించారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం బుధవారంతో ముగియడంతో వారిని సన్మానించారు. సర్పంచ్ మీరా విజయ్ కుమార్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు, గ్రామపంచాయతీ సిబ్బందికి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ గ్రామానికి 5సంవత్సరాల కాలం పాటు ఎనలేని సేవలు చేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో అబివృద్ధి పర్చిన గ్రామసర్పంచ్‌కు, వారి పాలకవర్గ సభ్యులకు, గ్రామస్తుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మీరా విజయ్ కుమార్, ఉపసర్పంచ్ విక్రమోద్దీన్, రఫీక్, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

ఉట్నూర్ : ప్రజల ద్వారా ఎన్నికై సర్పంచులుగా ఐదు సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తి చేసుకొని పదవీ విరమణ పొందిన గ్రామపంచాయతీ సర్పంచ్‌లను బుధవారం ఉట్నూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, ఎంపీడీఓ తిరుమల ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లను శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయం అనేది శాశ్వతం కాదని, కేవలం ఐదు సంవత్సరాలకు ఒకసారి పదవులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుతూ ఉంటాయని అన్నారు. తమ కర్తవ్యలను మనస్ఫూర్తితో నిర్వహించారని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీఓ మహేష్, ఈజీఎస్ ఏపీఓ రజనీకాంత్, ఎంపీటీసీ, సర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పదవీకాలం ముగుస్తున్న సర్పంచులను ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ఎంపిఓ లక్ష్మణ్, అవార్డు అందుకున్న పంచాయతీ కార్యదర్శి మహేందర్‌ను సైతం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సునీత మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాటు సర్పంచులు గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, జడ్పీటీసి నల్ల వనిత రాజేశ్వర్, మాజీ ఎంపీపీ చందాల ఈశ్వరి రాజన్న, వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు కరీంఖాన్, సర్పంచులు రాగం గంగమ్మ, మయూరి భోజన్న, దొగ్గలి ప్రమీల రాజేశ్వర్, బీఆఐ

లక్షెట్టిపేట : ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అన్నం మంగ ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచులను సన్మానించారు. పూలమాలలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ, ఏపీఓ వెంకటరమణ, జడ్పీటీసి సత్తయ్య, వైస్ ఎంపీపీ, కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్స్, పలువురు ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధనౌక ఆశయాలు కొనసాగిస్తాం

నవతెలంగాణ-వేమనపల్లి

ప్రజా గాయకుడు, యుద్ధనౌక, సామాజిక ఉద్యమకారుడు గద్దర్ జయంతి పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో విద్యార్థి సంఘాల నాయకులు ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గద్దర్ పేద ప్రజల విముక్తి కోసం విద్యార్థి సంఘం నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారుడు, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రత్యేక పాత్ర పోషించారని గుర్తు చేశారు. తన పాటతో మాటతో నాట్యంతో జన హృదయాలను గెలిచిన సామాజిక విప్లవకారుడని కొనియాడారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన ఆశయాలతో బుద్ధుని బోధనలతో పల్లెలకు తిరిగి సంపండ వర్గాలను చైతన్య పరిచారని అన్నారు. అలాంటి గద్దర్ లేకపోవడం తెలంగాణ రాష్ట్ర ప్రజలకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు దుర్గం మల్లేష్, కేవిపీఎస్ జిల్లా కార్యదర్శి డూర్కే మోహన్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మల్లేష్ నేత పాల్గొన్నారు.



లక్ష్మణచాంద : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమాన్ని తన గొంతుకతో మరింత ఉధృతం చేసిన గద్దర్ సేవలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ నసీరుద్దీన్, సర్పంచ్ ముత్యంరెడ్డి, నాయకులు అడ్వాల రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, అంబేద్కర్ సంఘ నాయకులు రాజేశ్వర్, రాములు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రం కోసం మీ-సేవలో స్లాట్ బుక్ చేసుకొని నిర్ణీత తేదీలో సదరం శిబిరంలో సంప్రదించాలని, ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 10 గంటలకు స్లాట్ ఓపెన్ చేయడం జరుగుతుందని, సర్టిఫికెట్ కాల పరిమితి పూర్తి అయిన వారు పున్ణరుద్ధరణ కొరకు, నూతన సర్టిఫికెట్ పొందేందుకు సకాలంలో హాజరు కావాలని తెలిపారు. ఫిబ్రవరి 6, 9 తేదీలలో మూగ, చెవుడు(100), 8, 19 తేదీలలో శారీరక వికలాంగులు-ఆర్థో(100), 14, 23 తేదీలలో కంటి చూపు (60), 27, 29 తేదీలలో మానసిక వికలాంగులు (100)లకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అర్హత గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. బుధవారం ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో రిమ్స్‌లోని డైస్‌లో నిర్వహించిన శిబిరానికి ఉమ్మడి జిల్లా నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు పెద్ద సంఖ్యల్లో తరలొచ్చారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి చిన్న పిల్లల కార్డియాలజిస్ట్ డాక్టర్ అమోల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిని పరిశీలించిన వైద్యులు అవసరమైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి రావాలని సూచించారు. చిన్న పిల్లల్లోని గుండె సంబంధిత వ్యాధులపై నిర్వహించిన శిబిరానికి బాధిత చిన్నారులు పెద్ద సంఖ్యలో వచ్చారని డాక్టర్ అమోల్ తెలిపారు. అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. అవసరమైన వారికి ఎన్జీవోగ్రాం, ఓపెన్ హార్ట్ సర్జరీలను ఉచితంగా చేస్తున్నామన్నారు. ఆదిలాబాద్‌లో ఇది వరకే మూడు క్యాంప్‌లు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ ఆర్ఎంఓ చందు, డైస్ మేనేజర్ డా.రాధికా, డా.జుబియా, చేతన్, శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జున్, ప్రవీణ్, ప్రశాంత్, ఉమాకాంత్, గోపాల్, వినోద్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేత

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పత్తి నిల్వలు పెరిగిపోయినందున తాత్కాలికంగా కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. సీసీఐ ఆధ్వర్యంలో గల వరలక్ష్మి ఇండస్ట్రీస్, ఆదిశంకరాచార్య కాటన్ మిల్లు, చెన్నూర్ కాటన్ కంపెనీ, జీఆర్ఆర్ ఇండస్ట్రీస్‌లో పత్తి నిల్వలు అధికంగా ఉన్నట్లు తెలిపింది. ఈ కారణంగా ఫిబ్రవరి 1 నుండి పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నందున రైతులు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. కొనుగోళ్లు ప్రారంభించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

స్టాఫ్ నర్స్ ఉద్యోగం సాధించిన మండల వాసి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము శ్రీలత, ఇటీవల ప్రకటించిన స్టాఫ్ నర్స్ ఫలితాలలో ప్రతిభ చాటి ఉద్యోగం సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ ప్రభుత్వ ఉద్యోగం సాధించడం హర్షనీయమని గ్రామస్తులు కొనియాడారు. శ్రీలత బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియమాక పత్రం అందుకోవడానికి హైదరాబాద్ బయలుదేరారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-జైపూర్

భీమారం-ఎల్కేశ్వరం, సుద్దాల-ఎల్బీపేట్ మధ్య రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. బుధవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వాలు మారినా పాలకులుమారినా రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆవేధన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారిన ప్రతి సారి రోడ్డు నిర్మించాలని కోరుతూ వినతలు అందజేసినా రోడ్డు నిర్మాణం పట్ల నిర్లక్ష్యం వీడటం లేదని గ్రామస్థులు ఆవేధన వ్యక్తం చేశారు. ఆరెపల్లి రోడ్డు నుంచి ఎల్కేశ్వరం వెల్లాలంటే రాత్రి పూట చాలా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని అన్నారు. వర్షా కాలంలో మరీ ఇబ్బందిగా ఉంటుందని పంట పొలాల మధ్య నుండి చెప్పులు చేతబట్టి బురుద గుంటల మధ్య ఇల్లు చెరాల్సివుంటుందని వివరించారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం పట్ల శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యేను కలిసి విన్నవించుకున్నారు. గ్రామస్థులు విన్నవించిన ఇబ్బందుల పట్ల సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.